బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు అండగా ఏఐటీయూసీ

జిల్లా కార్యదర్శి హనుమంతరావు

విశాలాంధ్ర-గుంటూరు : ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీఎస్ఎన్ఎల్ గుంటూరు బిజినెస్ ఏరియా జీఎం తమకు వద్దంటూ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు చేస్తున్న దీక్షలకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు అన్నారు. అవసరమైతే ఉద్యోగులకు అండగా ప్రత్యక్ష ఆందోళనకు సైతం తాము సిద్ధమంటూ హెచ్చరించారు. జీఎంను బదిలీ చేయాలని కోరుతూ చంద్రమౌళినగర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఏయూఏబీ ఆధ్వర్యంలో ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 6వ రోజుకు చేరుకు న్నాయి. ఈ దీక్షలను ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎం.హనుమంతరావు, జనరల్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి రవికుమార్ ప్రారంభించారు. అనంతరం ఎన్ఎఫ్‌టీఈ జిల్లా కార్యదర్శి గంటా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జీఎం స్థాయిలో ఉన్న అధికారి విజ్ఞతతో ఆలోచించి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలే గాని ఉద్యోగు లను వేధింపులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. ఇటువంటి విధానాలు సంస్థ అభివృద్ధికి ఆటంకంగా మారుతాయని అన్నారు. 6వ రోజు 30 మంది ఉద్యోగులు, 15 మంది విశ్రాంత ఉద్యోగులు దీక్షలలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఈయూ జిల్లా కార్యదర్శి పులి సురేష్, ఏఐజీఈటీఓఏ కార్యదర్శి శివరామ్ ప్రకాష్, ఎస్ఎన్ఈఏ కార్యదర్శి సాంబశివ రావు, ఏఐబీఎస్ఎన్ఎల్ ఈఏ జిల్లా కార్యదర్శి నరసిం హారావు, ఎస్ఈడబ్ల్యూఏ జిల్లా కార్యదర్శి ఈశ్వర్, పెన్షనర్స్ యూనియన్ నాయకులు కట్టా వెంకటేశ్వర్లు, మరియదాసు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కన్నా మాస్టారుకు డాక్టరేట్

విశాలాంధ్ర-గుంటూరు : నగరంలో ఐదు దశాబ్దాలుగా పేద, మధ్యతరగతి వర్గాల పిల్లలకు విద్యాబుద్దులు నేర్పుతూ ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న కన్నా మాస్టారును ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ద్వారా డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ వరించింది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ద్వారా ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ అసిస్టెంట్ రీసెర్చ్ డైరెక్టర్ ఆచార్య బి.ప్రసాద్ బాబు మార్గదర్శకంలో 'ఏ స్టడీ ఆన్ టీచింగ్ ఆటిట్యూడ్ ఆప్టిట్యూడ్ అండ్ ఎఫెక్టివ్‌నెస్ యమాంగ్ ది ప్రోస్పెక్టివ్ టీచర్స్' అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు అందుకున్నారు. స్థానిక రైలుపేట కన్నా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆవరణలో రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రసాద్ బాబు చేతుల మీదుగా కన్నా మాస్టార్, రాజేశ్వరి దేవి దంపతులను శాలువా పుష్పగుచ్ఛంతో పీహెచ్‌డీ పట్టాను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వాణిజ్య పన్నుల శాఖ అధికారి సత్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భాష్యం విద్యార్థుల అసామాన్య ప్రతిభ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జేఈఈ మెయిన్-2023 ఫలితాలలో భాష్యం ఐఐటి జేఈఈ అకాడమీ విద్యార్థులు ఆలిండియా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. శనివారం స్థానిక చంద్రమౌళి నగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో ఆయన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ భాష్యం విద్యార్థులు ఏ.మౌర్యనందన్ ఆలిండియా 3వ ర్యాంకు, వై.మణీందర్ రెడ్డి 6వ ర్యాంకు, పి నిశ్చల్ సుభాష్ 7వ ర్యాంకు, టి.బాలకోటయ్య 8వ ర్యాంకు, సీహెచ్ కుందన్‌సాయి 9వ ర్యాంకు, కె.లక్ష్మిసూర్య 14వ ర్యాంకు, ఆర్.అక్షయ కార్తీక్ 24వ ర్యాంకు, వి.దీపేష్ 28వ ర్యాంకు, ఐ.శివరామ్‌మణికంఠ 39వ ర్యాంకు, బి.లోకేష్ 46వ ర్యాంకు వంటి 50 లోపు 10 అత్యుత్తమ ర్యాంకులతో పాటు ఆల్ ఇండియా వందలోపు 18 ర్యాంకులు, 200 లోపు 30 ర్యాంకులు, 500 లోపు 59 ర్యాంకులు కైవసం చేసుకుని 74.86శాతం సక్సెస్‌రేట్‌తో తమ సత్తా చాటారన్నారు. ఇంతటి ఘన విజయానికి తోడ్పడిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు, అధ్యాపకులకు ఛైర్మన్ రామకృష్ణ, భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ హనుమంతరావు అభినందనలు తెలిపారు.

'ఎస్ఆర్' విద్యాసంస్థల విజయభేరి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాలలో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారని జోనల్ ఇన్‌చార్జి ఎం.పూర్ణచందర్ రావు తెలిపారు. శనివారం స్థానిక గోరంట్లలోని విద్యాసంస్థల క్యాంపస్‌లో జరిగిన సమావేశంలో పూర్ణచందర్ రావు మాట్లాడుతూ ఎస్ఆర్ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించారని అన్నారు. ఇద్దరు విద్యార్థులు 99 కన్నా ఎక్కువ పర్సంటైల్ సాధించారని, 90 పర్సంటైల్ పైన 12 మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. ఎస్‌కె.అబ్దుల్ సమీర్ 99.91 పర్సంటైల్‌తో జాతీయ స్థాయిలో 118వ ర్యాంకు, ఎస్‌కె.ఆసిఫ్ 99.41 పర్సంటైల్‌తో 924వ ర్యాంకు, బాలవర్షిత 98.91 పర్సంటైల్‌తో 1811వ ర్యాంకు సాధించారని అన్నారు. బాలుర కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ విద్యా సంస్థలు స్థాపించిన రెండవ సంవత్సరంలోనే గుంటూరు క్యాంపస్ నుండి ఉత్తమ ఫలితాలను సాధించామని ఆనందం వ్యక్తం చేసారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అకాడమిక్ డీన్ అప్పిరెడ్డి, ప్రిన్సిపాల్స్ పద్మాకర్ రెడ్డి, సురేష్, శశిధర్‌లు అభినందించారు. విద్యాసంస్థల ఛైర్మన్ ఏ.వరదారెడ్డి, డైరెక్టర్‌లు మధుకర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, సీఈఓ సురేందర్ రెడ్డి, గారు, జీఎం రాజేంద్ర ప్రసాద్, గోవర్ధన్ రెడ్డి, అసిస్టెంట్ జోనల్ ఇంచార్జి మహేందర్ రెడ్డి విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని అభినందించారు.

ఘనంగా కామ్‌విక్టస్-2023

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో కామ్‌విక్టస్-2023 అనే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ రెవ.డా.సిస్టర్ ఫాతిమారాణి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్ర క్రైస్తవ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.మోజేస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార రంగంలో మెలకువలను వృత్తి పట్ల నైతిక బాధ్యత గురించి అవగాహన కల్పించారు. నేటి కార్పొరేట్ పోటీ ప్రపంచంలో కామర్స్‌కు అత్యంత ప్రాధాన్యత ఉన్నదని అన్ని రంగాల్లో కూడా కామర్స్‌కు ఆవశ్యకత ఉంటుందని ప్రతి ఒక్క విద్యార్థినీలు కూడా కష్టపడి ఇష్టంతో చదివి జీవితంలో అత్యున్నత స్థాయికి చేరాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు బిజినెస్ ఐడియాలు, క్విజ్, ప్రొడక్ట్ లాంచ్ అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులు ప్రధానం చేశారు. కామర్స్ విభాగాధిపతి జే.ప్రమీల రాణి, ఆర్.షారోన్ రాజ్, ఎం.అంజనాదేవి, జి.సరోజా, ఎస్.సుభాని, అధ్యాపకులు, విద్యార్థినిలు, సిబ్బంది పాల్గొన్నారు.

మే డేను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-పొన్నూరు : ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను కార్మిక లోకం జయప్రదం చేయాలని పొన్నూరు నియోజకవర్గ ఏఐటీయూసీ అధ్యక్షులు ఆరేటి రామారావు అన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయం వద్ద మే డే ఉత్సవాల కార్యచరణపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆరేటి మాట్లాడారు. కార్మికులు పనిగంటలు తగ్గింపు కోసం ఎనిమిది గంటల పనిదినం సాధించుట కోసం జరిగిన పోరాటంలో కార్మికనాయకులు ఉరి తీయబడ్డారని, తుపాకి గుళ్ళకు బలైనారని అన్నారు. అమరుల స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసనగా పోరాటాలను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేసేంత వరకు పోరాటం కొనసాగించేందుకు మే డే సందర్భంగా ప్రతినబూనాలన్నారు. మే డే రోజున ఉదయము 8 గంటలకు స్థానిక ఏఐటీయూసీ కార్యాలయం నుంచి జరిగే ర్యాలీ, సభలలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

Notice
IN THE COURT OF THE HON'BLE I ADDL.SENIOR CIVIL JUDGE:: GUNTUR
I.P.No:24/2022

Between:
Sangana Anjamma - **Petitioner**
And
Annapareddy Nagi Reddy & Others - **Respondents**

To,
R-1: Annapareddy Nagi Reddy, S/o. Sambi Reddy, Tirumala Enterprises (Fertilizers, Pesticides & seeds), Door No:1-171/B, Main Road, Prathi padu, Guntur Dist - 522019 and Native of Door No:1-71, Pata Mallayapalem (Vil), Prathipadu Mandal, Guntur Dist.

పై నెంబరు **Creditor I.P.** లో 1వ రెస్పాండెంట్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు **దీ:10-05-2023** కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉ.గం.**10-30 ని.లకు** పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది: **10-05-2023**

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

దాసరి ఉమామహేశ్వరరావు, పిటీషనరు తరపు అడ్వకేట్, 5/16 బ్రాడీపేట, గుంటూరు.

పెదకాకానిలో ప్రచార భేరి

విశాలాంధ్ర-పెదకాకాని : మండల కేంద్రమైన పెదకాకానిలో సీపీఐ, సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పెదకాకానిలో ప్రచార భేరి కార్యక్రమాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.నేతాజీ, సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చినాక పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, నిత్యవసర వస్తువులు పెరిగాయని, ఎల్ఐసీ, పోస్టల్, రైల్వే, టెలికాం, గనులు, ఓడరేవులు, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటీకరణ చేయటం అదానీ లాంటి వారికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రజలందరూ పోరాటాల ద్వారా మతోన్మాద బీజేపీ విధానాలను తిప్పికొట్టాలని ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా విభజన హామీలు వెనకబడిన జిల్లాలకు ప్యాకేజీ పోలవరం నిధులు రాజధాని నిధులు ఏ ఒక్కటి అమలు చేయలేదని రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ప్రతిపక్షం కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన హక్కులు రాబట్టడంలో విఫలమయాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, ఎం.సాంబయ్య, రమేష్, బి.బాబురావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మేడే విజయవంతం చేయండి: మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు : నగరంలో 137వ మేడేను ఘనంగా నిర్వహించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పిలుపునిచ్చారు. గుంటూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ విభాగంలో పైపులైన్ల నీటి లీకుల కార్మికులు శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)లో చేరారు. ఈ సందర్భంగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ యూనియన్‌లో చేరిన వారిని స్వాగతిస్తున్నామని అన్నారు. మే 1న జరిగే ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని కార్మికవర్గం యావత్ ఉత్సాహ వాతావరణంలో నిర్వహించాలని కోరారు. చికాగో నగరంలో చిందిన నెత్తురు వృథా కాకూడదన్నారు. ఎనిమిది గంటల పనిదినం కోసం జరిగిన పోరాటం విజయవంతం అయినప్పటికీ మరలా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పని గంటల పెంపునకు, శ్రమ శక్తిని పెట్టుబడిదారులకు కట్టబెట్టడం కోసం ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక హక్కుల రక్షణ కోసం కనీస వేతనాల అమలు కోసం పోరాడి సాధించుకున్న చట్టాల అమలు కోసం, పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. అనంతరం నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా దేరంగుల పవన్ కుమార్, చల్లా మరియదాస్, గౌరవాధ్యక్షులుగా కోట మాల్యాద్రి, కోశాధికారిగా వల్లెపు కుమార్‌లతో పాటు 11 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

విజ్ఞాన్స్ లారాకు నాక్ ఏ+ అక్రిడిటేషన్

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ లారా ఇంజనీరింగ్ కళాశాలకు ప్రతిష్టాత్మక నాక్ ఏ+(నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఫణీంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'సక్సెస్ మీట్' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని అతికొన్ని ఇంజనీరింగ్ కళాశాలలకే మాత్రమే ఉన్న నాక్ అక్రిడిటేషన్ గుర్తింపు విజ్ఞాన్స్ లారా ఇంజనీరింగ్ కళాశాలకు లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎప్పటికప్పుడు సెల్ఫ్ అసెస్‌మెంట్, కంటిన్యూస్ ఇంప్రూవ్‌మెంట్, కరికులర్ ఆస్పెక్ట్స్, టీచింగ్-లెర్నింగ్ అండ్ ఎవాల్యూయేషన్, రీసెర్చ్, ఇన్నోవేషన్స్ అండ్ ఎక్స్‌టెన్షన్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ లెర్నింగ్ రిసోర్సెస్ కేటగిరీలతో పాటు వివిధ అంశాల్లో కళాశాల ముందంజలో ఉన్నందువలన నాక్ ఏ+ అక్రిడిటేషన్ లభించిందన్నారు. వీటితో పాటు స్టూడెంట్స్ సపోర్ట్ అండ్ ప్రోగ్రెస్సన్, గవర్నెన్స్, లీడర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్, ఇనిస్టిట్యూషన్ వాల్యూస్ అండ్ బెస్ట్ ప్రాక్టీసెస్‌లలో తమ కళాశాల సత్తాచాటిందన్నారు. ఇప్పటికే న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేసే ఎన్‌బీఏ నుంచి 5 అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు విజ్ఞాన్స్ లారా ఇంజనీరింగ్ కళాశాలకు ఎన్‌బీఏ అక్రిడిటేషన్ లభించడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ లారా ఇంజనీరింగ్ కళాశాలలోని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రీ సర్వేపై వీఆర్ఏలకు అవగాహన

విశాలాంధ్ర-పొన్నూరు : మండలంలో రెండో విడత సమగ్ర భూముల రీ సర్వే ప్రారంభిస్తున్నట్లు తహశీల్దార్ శ్రీకాంత్ కేదార్నాథ్ అన్నారు. శనివారం కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల వీఆర్ఏలకు సమగ్ర భూముల రీ సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటివరకు రైతులు భూమిని ఆన్‌లైన్ నమోదు చేయించకపోతే వీఆర్వోల లాగిన్ ద్వారా నమోదు చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని వీఆర్ఏలకు సూచించారు. సమగ్ర భూముల రీ సర్వేపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రీ సర్వే చేసే ముందుగా రైతులకు భూమి వివాదాలు, కోర్టులు లిటికేషన్లు తదితర సమస్యలు ఉంటే వీఆర్ఓల దృష్టికి తేవాలని ఆయన సూచించారు. సర్వే ముందుగానే భూమి కలిగిన రైతుల నుంచి సంబంధిత దరఖాస్తులను తీసుకొని సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే సమగ్ర భూముల రీసర్వేను వీఆర్ఏలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్‌లు ఫణికుమార్, వాసు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

'ఊపిరితిత్తుల వ్యాధులు'పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక అమరావతిరోడ్డులో ఉన్న హిందూ ఫార్మసీ కళాశాలలో శనివారం ఉదయం 'ఊపిరితిత్తుల వ్యాధులు'పై అవగాహన సదస్సు నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వీ నాగభూషణం తెలిపారు. ప్రముఖ పల్మనాలజీ విభాగాధిపతి, హిందూ ఫార్మసీ కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ ఆర్.రామకృష్ణ ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సీఓపీడీ, ఆస్తమా, లంగ్ క్యాన్సర్ తదితర వ్యాధుల లక్షణాలు...వ్యాధి నిర్ధారణ పరీక్షలు... నివారణోపాయాలు...వాటి చికిత్సకు అందుబాటులో ఉన్న వివిధ ఔషధాలు గురించి ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కళాశాల ఛైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూధనరావులు డాక్టర్ రామకృష్ణకు అభినందనలు తెలియజేశారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, హెచ్ఓడీ డాక్టర్ ఎన్.హేమకుమారి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ఎంసెట్ నిర్వహించిన ఏఐఎస్ఎఫ్



విశాలాంధ్ర-తెనాలి : అఖిల భారత విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో తెనాలి నియోజకవర్గం పరిధిలోని కళాశాలలో విద్యార్థులకు మోడల్ ఎంసెట్ నిర్వహించామని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు రాష్ట్రం మొత్తం మోడల్ ఎంసెట్ ఎగ్జామ్‌ని నిర్వహించటం జరుగుతుందన్నారు. అందులో భాగంగా శనివారం తెనాలిలో ఉన్న కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే తయారు చేయించిన ఎగ్జాంని శనివారం నిర్వహించామన్నారు. విద్యార్థులు ఎదుర్కొనే సమస్యల పట్ల ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందన్నారు. ఎన్నారై కళాశాల ప్రిన్సిపల్ శివన్నారాయణ మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల్ని ప్రోత్సహించే విధంగా ఇలాంటి మోడల్ ఎంసెట్ ఎగ్జామ్స్‌ని కండక్ట్ చేయడం అభినందనీయమని అన్నారు. మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు మద్దినేని కిరణ్ బాబు, తెనాలి పట్టణ ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి చెన్నూరి సాయి, ఉపాధ్యక్షులు తలతోటి శ్రీను, ఏఐఎస్ఎఫ్ నాయకులు కావేటి యశ్వంత్, శివ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని సాగనంపుదాం... దేశాన్ని కాపాడుకుందాం..

విశాలాంధ్ర-తుళ్లూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వినాశకర విధానాలకు నిరసనగా సీపీఐ, సీపీఎం చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమాన్ని శనివారం ఐనవోలు గ్రామంలో చేశారు. తాడికొండ నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకరరావు మాట్లాడుతూ బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. బీజేపీ అధికారం చేపట్టాక నిత్యావసర ధరలు ఆకాశానికి తాకాయన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు జరపకుండా బీజేపీ ఏపీకి ద్రోహం చేసిందన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఆందోళనలో ప్రజలు భాగస్వాములు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. సీపీఎం నేత ఎం రవి మాట్లాడుతూ రాజధానికి నిధులు ఇవ్వకుండా.. విశాఖ ఉక్కును ప్రైవేటు వ్యక్తులకు ధారా దత్తం చేయబోతున్న కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం బిజెపికి సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

వర్సిటీల్లో శాస్త్రీయ పరిశోధనా సంస్కృతి పెరగాలి

విశాలాంధ్ర-మంగళగిరి : దేశ వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లోనూ శాస్త్రీయ పరిశోధనా సంస్కృతి అతి వేగంగా పెరగాలని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వైస్ ఛాన్సలర్ ఆచార్య బీజే రావు సూచించారు. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో సునిశిత పరిశీలనా తత్వం పెరగాలనీ, అప్పుడే సమాజ ఉపయుక్తమైన ఆవిష్కరణలు వెలికి తీసేందుకు అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. శనివారం ఉదయం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 16వ 'రీసెర్చ్ డే' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో ఆచార్య బీజే రావు విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లనుద్దేశించి ప్రసంగించారు. దేశం కోసం శాస్త్ర సాంకేతిక పరంగా ఏదైనా చేయాలన్న తపన విద్యార్థుల్లో పెరిగితే, ఉత్తమ పరిశోధనలు ఆవిష్కృతమవుతాయంటూ, ఆ దిశగా బోధకులు విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. యూనివర్సిటీల్లో ప్రొఫెసర్లు కేవలం విద్యార్థులకు విద్యను బోధించడమే కాకుండా విద్యార్థుల వైపు నుంచి ఆలోచించాలని సూచించారు. సీఎస్ఐఆర్-నేషనల్ ఫిజికల్ లేబొరేటరీ డైరెక్టర్ డాక్టర్ ఆచంట వేణుగోపాల్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల బ్రాండ్‌ను నిర్మించేది విద్యార్థులేనన్నారు. ఏదేని విశ్వవిద్యాలయం గొప్పదనాన్ని దాని పాత విద్యార్థులే ప్రతిబింబిస్తుంటారన్నారు. వచ్చే ఏడాది కాలంలో యూనివర్సిటీలో రీసెర్చ్ అండ్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా పేర్కొన్నారు. యూనివర్సిటీ ప్రొ వైస్ ఛాన్సలర్ ఆచార్య డి.నారాయణరావు మాట్లాడుతూ గడచిన మూడేళ్లలో కేంద్ర ప్రభుత్వం జాతీయ హైడ్రోజన్ మిషన్, డీప్ ఓషన్ మిషన్ తదితర ప్రతిష్టాత్మక ప్రోగ్రాములను ప్రవేశపెట్టిందని అన్నారు. అనంతరం వేదికపై రీసెర్చ్ డే సావనీరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన 30 మంది స్కాలర్లు, విద్యార్థులకు బంగారు పతకాలు, 12 మందికి రజత పతకాలతో పాటు ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమకుమార్, డీన్లు డాక్టర్ భరద్వాజ్, డాక్టర్ విష్ణుపద్, డాక్టర్ రంజిత్ థాపా, రీసెర్చ్ డే కన్వీనర్ డాక్టర్ లక్ష్మీ శిరీష, డాక్టర్ మణికందన్‌లు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో తాళ్లపాలెం గ్రామం

విశాలాంధ్ర-పొన్నూరు : మండలంలోని తాళ్లపాలెం గ్రామం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంది. గ్రామంలో మురుగునీరు పారుదల లేక ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోయి దుర్వాసన వెదజల్లి దోమలకు ఆవాసాలుగా మారింది. కొద్దిపాటి వర్షానికి మురుగు కాలవల్లో నీరు రోడ్లపైకి వచ్చి ప్రజలకు అసౌకర్యానికి గురవుతున్నారు. గ్రామం ప్రధాన రహదారి తుంగభద్ర వంతెన పక్కన దశాబ్దాలుగా నిర్మించిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాద భరితంగా మారింది. చిన్నపాటి వర్షం గాలులకే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పెద్ద పెద్ద మంటలు ఎగిసిపడటంతో ప్రజలు భయాందోళన చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు ప్రక్కనే రెండు అడుగుల ఎత్తులో ఉండి విద్యుత్ తీగలు చేతికందే దగ్గర్లోనే ఉండటంతో మూగజీవాలకు ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన సమస్యలైన మురుగునీరు, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలను గ్రామ అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు ఉచిత వేసవి ఈత శిక్షణ ప్రారంభం

విశాలాంధ్ర-తాడేపల్లి: అక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలు నుండి ప్రతీ యేటా నిర్వహించే పిల్లల వేసవి ఈత శిక్షణ శిబిరం ఆదివారం ఉదయం 7:00 గంటలకు అక్వా డెవిల్స్ అసోసియేషన్ లైఫ్ ఛైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు, బీసీసీఐ మాజీ ఉపాధ్యక్షులు గోకరాజు గంగరాజు గెస్ట్ హౌస్, అమరావతి కరకట్ట, లైలా గంగరాజు నగర్ ,ఉండవల్లి లోని (ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ గల) స్విమ్మింగ్ పూల్ నందు 5 సంవత్సరాల నుండి 15 సంవత్సరాలలోపు బాల ,బాలికలకు ఈత శిక్షణ శిబిరం ప్రారంభోత్సవము జరుగుతుందని తెలిపారు.

'నీడ్స్ బ్లడ్ సెంటర్'కు రూ.8లక్షల చెక్కు అందజేత

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు గుంటూరులోని 'తలసీమియా నీడ్స్ బ్లడ్ సెంటర్ చేస్తున్న సేవలు అభినందనీయమని కొల్లా సాకేత్ ఫౌండేషన్ అధినేత, ఎన్నారై కొల్లా శ్రీనివాసరావు అన్నారు. తలసీమియా చిన్నారుల ఆరోగ్య వైద్య సేవలు నిమిత్తం నీడ్స్ బ్లడ్ సెంటర్ నిర్వాహకులకు కొల్లా శ్రీనివాసరావు 8 లక్షల రూపాయల చెక్కును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కొల్లా సాకేత్ ఫౌండేషన్ ప్రతి సంవత్సరం యుఎస్‌లో 5కే వాక్ నిర్వహిస్తారన్నారు. ఈ వాక్ ద్వారా వచ్చిన డొనేషన్స్‌కు తాము కొంత యాడ్ చేసి ఇండియా...యుఎస్ లోని పేద పిల్లల ఎడ్యుకేషన్‌కు చేయూతనిస్తామని చెప్పారు. ఈ సంవత్సరం హైదరాబాదులో తలసీమియాతో బాధపడుతున్న పాపకు రూ.3 లక్షల 25 వేలు అందజేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా తలసీమియా స్కిల్ సర్వీసెస్ సొసైటీకి చిన్నారుల వైద్య సేవలు నిమిత్తం 13 లక్షలు, అలాగే తలసీమియా నీడ్స్ బ్లడ్ సెంటర్‌కు 8 లక్షల రూపాయల చెక్కును ఇవ్వటం జరిగిందన్నారు. అనంతరం నీడ్స్ బ్లడ్ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ యడ్లపల్లి సందీప్ మాట్లాడుతూ తలసీమియాతో బాధపడుతున్న చిన్నారులకు తాము చేస్తున్న సేవలను గుర్తించి చిన్నారుల వైద్య సేవల నిమిత్తం రూ.8 లక్షల చెక్కును శ్రీనివాసరావు అందజేయడం మరువరానిదని కొనియాడారు. కొల్లా శ్రీనివాసరావు లాంటి మరెందరో ప్రోత్సాహం ఉంటే తలసీమియా చిన్నారులకు మరిన్ని సేవలు చేసేందుకు మనోధైర్యంతో ముందుకు సాగుతామన్నారు. క్యాంపు ఆర్గనైజర్ సాంబశివారెడ్డి (శివాజీ) మాట్లాడుతూ 2012లో స్థాపించిన కొల్లా సాకేత్ ఫౌండేషన్ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు కొల్లా శ్రీనివాసరావు పేద ప్రజల విద్యకు, అనారోగ్యానికి గురైన చిన్నారులకు చేస్తున్న సేవలు అనిర్వచనీయమని ప్రశంసించారు. కొల్లా శ్రీనివాసరావు, ఆయన కుటుంబ సభ్యులు తలసీమియా చిన్నారులకు పండ్లు, బిస్కెట్స్, కూల్ డ్రింక్స్ అందజేశారు. అనంతరం నీడ్స్ బ్లడ్ సెంటర్ నిర్వాహకులు కొల్లా శ్రీనివాసరావును శాలువాతో, పూల బొకేతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నీడ్స్ బ్లడ్ సెంటర్ అధ్యక్షులు గూడూరు శ్రీధర్, ఉపాధ్యక్షులు యడ్లపల్లి సందీప్, మెడికల్ ఆఫీసర్స్ వీసం మణికంత, మురుకొండ కిషోర్, కొల్లా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

నిజాయితీ గల వీఆర్వోను నియమించండి

విశాలాంధ్ర-తాడికొండ : మా గ్రామానికి నిజాయితీ కలిగిన వీఆర్వోను నియమించాలని లాం గ్రామస్తులు వైసీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వ యకర్త కత్తెర సురేష్ కుమార్‌ను కోరారు. ఆయన శనివారం గ్రామంలో నీవే మా నమ్మకం జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటి ప్రచారం సందర్భంగా గ్రామస్తులు సురేష్ కుమార్‌ను చుట్టుముట్టారు. ప్రస్తుతం ఉన్న వీఆర్వో తమకు వద్దని నిజాయితీ కలిగిన పర్మినెంట్ వీఆర్వోను నియమించాలని తాత్కాలిక వీఆర్వోలు వద్దని అవసరమైతే తాము ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అలాగే గ్రామంలో మంచినీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నామని సరైన మంచినీరు అందక నాన అగచాట్లు పడుతున్నామని తెలిపారు. గ్రామంలో మురుగునీరు సమస్య తీవ్రంగా ఉందని, దోమలు వృద్ధి చెంది గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారని విన్నవించారు. గ్రామంలో మీ పర్యటన జరుగుతుంటే మాకు కనీసం సమాచారం లేదని ఓ యువకుడు వాపోయాడు. అలాగే పోస్టాఫీస్ వద్ద సీసీ రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరారు. స్పందించిన సురేష్ కుమార్ తక్షణమే సీసీ రోడ్డును వేయించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. మంచినీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని, మంచి వీఆర్వోను నియమించేందుకు చర్యలు చేపడతామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. వైసీపీ నాయకులు షేక్ మీర్జావలి, షేక్ నూర్జహాన్, కొల్లికొండ వెంకట్, రాయపూడి రంగారావు, దాసరి రాజు, మాదాసు రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి చెరువును సాధించడం విశేషం

విశాలాంధ్ర-ఫిరంగిపురం: రాష్ట్రంలో ప్రతి గ్రామానికి తాగు నీటి చెరువు ఉండటం సహజమేనని ముఖ్యంగా ఫిరంగిపురం మండలంలోని అమీనా బాదు-వేములూరిపాడు గ్రామాలకు 47 ఎకరాలు విస్తీర్ణం కలిగిన కోట్ల రూపాయాలు ఖరీదు చేసే తాగు నీటి చెరువును కోర్టు ద్వారా సాధించుకోవడం విశేషమని గ్రామ నాయకులను, ప్రజలను ఈ సందర్భంగా అభినందించారు. ప్రతి ఇంటికి ఉచిత నీటి పంపును సదుపాయం కల్పించేందుకు జల జీవన్ పథకం ద్వారా మంజూరైన తాగు నీటి పథకానికి తాడికొండ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ శనివారం శంకుస్థాపన పనులను ప్రారంభించారు. ప్రతి గ్రామంలో తాగు నీటి చెరువులు ఉన్నాయంటే గొప్ప సహజ సంపద గ్రామానికి ఉన్నట్లే నన్నారు. అమీనాబాదు, వేములూరిపాడు గ్రామ అభివృద్ధికి వైసీపీ తరుపున తన సహాయ సహకారాలు నిత్యం ఉంటాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పిటిసి దాసరి కత్తిరేణమ్మ, సర్పంచ్ కొరివి ఆనంద్, ఎంపిటిసిలు గాంధి బుడే, సకిలా లక్ష్మీ, అమర్లపూడి రత్నం, మరియబాబు, మీరా, మున్నంగి సుధాకర్‌రెడ్డి, సెక్రటరి కిషోర్‌బాబు, విఆర్వో బి.నర్మద, జొన్నల గడ్డ ప్రసాదు, కంభంపాటి రాంబాబు, పచ్చల చిన్నా, షాదుల్లా, ఐజక్, ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ రామకృష్ణారావు, ఎఇ.వెంకటేశ్వర్లు, వర్కు ఇన్‌స్పెక్టర్‌లు, ఇంజనీర్ అసిస్టెంట్లు, వాంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

విశాలాంధ్ర-గుంటూరు : వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉర్దూ డీఐ ఎండీ ఖాసిం అన్నారు. నగరంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పాఠశాల తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని, ప్రతి విషయంలో తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ పాఠశాలల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని, గతంలో ఎన్నడూ లేని విధంగా తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి పిల్లల ప్రోగ్రెస్ రిపోర్ట్ అందించే విధంగా ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. సమయాన్ని వృథా చేయకుండా పిల్లల నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి కృషి చేయాలని, దీనికి గాను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సహకారం వేసవి సెలవుల్లో కూడా ఉంటుందని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి మాట్లాడుతూ తల్లిదండ్రుల సూచనలు పాటిస్తూ పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ సుభాని మాట్లాడుతూ ప్రభుత్వం నాడు-నేడు ద్వారా మన పాఠశాలను ఎంతో అభివృద్ధి చేసిందని, పాఠశాలలు తెరిచే నాటికి జగనన్న విద్యా కానుక అందించడానికి కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: జగనన్న గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని వేసవి సమయంలో ఇంటి పనులు చేసుకొనేందుకు వీలుగా ఉంటుందని ఎంపిడివో అన్నారు. హసింగ్ డే సందర్భంగా మండలంలోని నుదురుపాడు గ్రామంలో జగనన్న గృహాల లబ్ధిదారులకు సర్పంచ్ శివ నాగమల్లేశ్వరి అధ్యక్షతన శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపిడివో మాట్లాడుతూ ప్రతి పేద వానికి ప్రభుత్వం ద్వారా సొంతింటిని సమకూర్చిందని తెలియజేశారు. హౌసింగ్ ఎఇ గుంటుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో ఇల్లు లేని పేద కుటుంబాలు ఉండకూడదనే ప్రభుత్వం సంకల్పంతో అందిస్తున్న జగనన్న నిర్మాణాలు త్వరగా పూర్తి కావడానికి అధికారులు, ప్రజా ప్రతి నిధులు సహకారం ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని కోరారు. కార్యక్రమంలో మండల రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ పేరుపోగు కోటేశ్వరావు, సెక్రటరి పామిశెట్టి శౌరిజోజి, విఆర్వో శివకోటేశ్వరావు, ఇంజనీరింట్ అసిస్టెంట్ మిషారత్, హౌసింగ్ ఇన్‌స్పెక్టర్ తోళ్ళమడుగు శ్రీనివాసరావు వార్డు మెంబర్లు వాలంటీర్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత స్థాయి హాస్పిటల్స్‌కు తీసుకెళ్ళాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆశా నోడల్ ఆఫీసర్స్ సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక అధికారి డాక్టర్ సుబ్బరాజు మాట్లాడుతూ మాతృ శిశు సంరక్షణలో భాగంగా గర్భం దాల్చిన 3 నెలలకు ముందే గర్భిణీ నమోదు చేసి ప్రభుత్వం ఇచ్చిన గైడ్ లైన్స్ ప్రకారం పరీక్షలు నిర్వహించి అపాయకర పరిస్థితులను గుర్తించి సకాలంలో మెరుగైన చికిత్స నిమిత్తం ఉన్నత స్థాయి హాస్పిటల్స్‌కు తీసుకెళ్ళాలన్నారు. ఉప కేంద్ర పరిధిలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, కౌమర దశ బాలికలకు రక్తహీనతను గుర్తించి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలతో చికిత్స చేయాలని సూచించారు. అలాగే మాతృ శిశు సంరక్షణలో భాగంగా గృహ సందర్శనాలను, అన్ని ఆరోగ్య కార్యక్రమాలను ఆశాల ద్వారా మెరుగైన సేవలను అందించేలా కృషి చేయాలని కోరారు. డీపీహెచ్ఎన్ఓ కె.శాంత కుమారి, డీసీఎం సురేష్ పాల్గొన్నారు.

రోగుల సహాయకులకు భోజనం అభినందనీయం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రిలోని మధురాన్నంలో పేద రోగుల సహాయకుల కోసం నాణ్యమైన చక్కటి భోజనం అందించడం అభినందనీయమని జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం మధురాన్నం భోజనశాలను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతితో కలిసి ఆమె సందర్శించారు. భోజన శాలలోని వివిధ విభాగాలను ఆమె పరిశీలించారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

రెవిన్యూ కోర్టు నిర్వహించిన తహశీల్దార్

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలో నెలకొన్న భూమి తగాదాలు, పొలం తగాదాలు, హద్దుల వివాదాలు తదితర రెవిన్యూ పరిధిలోకి వచ్చే సమస్యల పరిష్కార వేదికగా శనివారం తహశీల్దార్ బి.కిరణ్ కుమార్ రెవిన్యూ కోర్టు నిర్వహించారు. ఈ రెవిన్యూ కోర్టు నందు భూ వివాదాల పిర్యాదు చేసిన ఇరు పక్షాల వాదనలను విని వారికి ఉన్న భూమి హక్కు పత్రాలను పరిశీలించి ఆయా గ్రామ రెవిన్యూ రికార్డులు వీఆర్ఓల సహకారంతో తనిఖీ చేసి వివాద పరిష్కారానికి సలహాలు సూచనలు చేశారు. అలాగే మండలంలో అన్ని గ్రామాల్లో భూ వివాదాల సమస్యలు ఏమైనా ఉంటే ఇరు వర్గాలు తమ దృష్టికి తెచ్చి రెవెన్యూ కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

1 నుంచి పల్నాడు ప్రీమియర్ లీగ్

విశాలాంధ్ర-గురజాల: స్వర్గీయ నందమూరి తారకరామారావు శతజయంతి ఉత్సవాలలో భాగంగా మే 1వ తేదీ నుండి చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు ఆటలపోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ వైద్యులు, ట్రస్ట్ వ్యవస్థాపకుడు డా.చల్లగుండ్ల శ్రీనివాస్ తెలిపారు. 1వ తేదీ నుండి పల్నాడు ప్రీమియర్ లీగ్,12,13 తేదీల్లో కబడ్డీ పోటీలు, 15,16 తేదీల్లో వాలీబాల్ పోటీలు, 20,21 తేదీల్లో షటిల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాల్గొనదలచిన క్రీడాకారులు ట్రస్ట్ సభ్యులను సంప్రదించగలరు.

ప్రారంభమైన క్రికెట టోర్నమెంట్

విశాలాంధ్ర-గురజాల: మండలంలోని గోగులపాడు గ్రామంలో శ్రీ పోతులూరి వీర బ్రహ్మం తిరునాళ్ళ సందర్భంగా ఏర్పాటు చేసిన డా.వైయస్సార్ క్రికెట్ టోర్నమెంట్ ను శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలుపుతూ గెలుపోటములు సహజం అని వాటిని తట్టుకొని నిలబడితేనే జీవితంలో ముందుకు సాగిపోతాం అని మురళీధర్ రెడ్డి అన్నారు. మందపాటి రమేష్ రెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

విశాలాంధ్ర-శావల్యాపురం: వలస కూలీలను నివారించేందుకు ప్రభుత్వం ఉపాధి పనులు చేపట్టిందని గ్రామంలోని ప్రజలంతా ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బోడాల వీరాంజనేయులు అన్నారు. మండలంలోని బొందిలిపాలెం గ్రామములో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున కూలీలు ఉదయం తొందరగా పనికి రావాలని, వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పని ప్రదేశాల్లో ప్రథమ చికిత్సకి కావాల్సిన అన్ని వసతులు కల్పించాలని ఏఎన్ఎంలకు సూచించారు. ఆయన వెంట అల్లూరి వెంకటరావు, బోడాల ప్రసాదరావు, పసుమర్తి శ్రీనివాసరావు, పాపసాని సాంబయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ గొంగటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మేడేకు ఘన ఏర్పాట్లు

విశాలాంధ్ర-వినుకొండ: ప్రపంచ కార్మికుల పండుగ రోజు అయిన మేడే. ఉత్సవాలకు, వినుకొండ శివయ్య స్తూపం సెంటర్ ముస్తాబయింది సెంటర్ అంతా ఎర్రజెండాలతో. ఎర్రబావుటాలతో అలంకరించారు స్తూపం చుట్టూ ఎర్రబావుటాలను కట్టారు. నియోజకవర్గంలో వినుకొండ పట్టణంలో మే డే ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

చల్లగుండ్లలో చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - నకరికల్లు : మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో గ్రామ సర్పంచ్ అరవ ఆదిలక్ష్మి - నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని శనివారం వైకాపా నాయకులు మేడికొండ రామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కె.అప్పారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'విశ్వసాయి' విజయభేరి

విశాలాంధ్ర-వినుకొండ: విశ్వసాయి జూనియర్ కళాశాల ఇంటర్ మొదటి మరియు రెండవ సంవత్సరం పరీక్ష ఫలితాలలో విజయభేరి మోగించింది. అతి తక్కువ మంది విద్యార్థులతో టౌన్ ఫస్ట్ సాధించిన ఏకైక విద్యా సంస్థ. ఇంటర్మీడియట్ పరీక్ష ఫలి తాల్లో వినుకొండ పట్టణంలో విశ్వసాయి విద్యార్థుల విజయఢంకా మోగించారని ఆ సంస్థ యాజమాన్యం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ యడవల్లి శ్రీనివాస శర్మ మరియు ప్రిన్సిపాల్ యడవల్లి శ్రీవల్లీ పావనీ అభినందనలు తెలియపరుస్తూ ఈ మార్కులు సాధించుటకు కృషిచేసిన అధ్యాపక బృందానికి ధన్యవాదాలు తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.

తాగునీరు, పారిశుద్ధ్యంపై శ్రద్ధ కనబరచాలి

విశాలాంధ్ర-గుంటూరు : నగరంలో తాగునీరు, పారిశుద్ధ్యంపై నగరపాలక సంస్థ శ్రద్ధ కనబరచాలని గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని ఒక హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరం, పరిసర ప్రాంతాల ప్రజలు దాహార్తిని తీర్చేందుకు 60 రిజర్వాయర్లు(ఓవర్ హెడ్ ట్యాంకులు) అపరిశుభ్రతపై అసోసియేషన్ నాయకులు నగర కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా కొంతవరకు ప్రక్షాళన జరిగిందని చెప్పారని, అయినప్పటికీ ఎక్కువ శాతం రిజర్వాయర్లు నిర్వహణ లోపం వల్ల ప్రజలు కాలుష్య నీరు తాగి జబ్బుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సంఘ సభ్యులు కొద్దికాలం క్రితం గుజ్జనగుండ్ల ట్యాంక్ శుభ్రతకు నడుం బిగించగా 24 ట్రక్కుల మురికిని తోడటం జరిగిందన్నారు. నెహ్రూనగర్ రిజర్వాయర్ మెట్లు పూర్తిగా పాడై చాలాకాలంగా క్లీనింగ్ జరగటం లేదని, దానిపై నగరపాలక సంస్థ అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. గుంటూరు నగరానికి ఉన్న పెద్ద ప్రధాన మురికి నీరు పారుదల జరిగే పీకల వాగు, అగతవరప్పాడు వాగుతో పాటు ఇతర చిన్న వాగులు ఐదు పైగా ఉన్నాయని వాటి నిర్వహణ కూడా సరిగా లేదని చెప్పారు. బుడంపాడు, శుద్ధపల్లి, వేజెండ్ల, గారపాడు, తక్కెళ్ళపాడు, గ్రామాలలో వేలాది ఎకరాలు పంట ముంపుకు గురవుతూ రైతులు నష్టపోతున్నారని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పడుచూరి పరంధామయ్య, నరసింహారెడ్డి, మద్ది రాధాకృష్ణ, ఆర్.అంజిరెడ్డి, ఆర్.రామ్ కుమార్, ప్రొఫెసర్ నూతలపాటి అరవింద తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని తరిమి కొట్టండి: మారుతి

విశాలాంధ్ర-దాచేపల్లి : దేశవ్యాప్తంగా సీపీఐ, సీపీఎంలు మోదీని గద్దె దింపండి - దేశాన్ని కాపాడండి అనే నినాదంతో చేపట్టిన ప్రచారభేరిలో భాగంగా పట్టణంలోని లైబ్రరీ సెంటర్‌లో శనివారం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ప్రజలను మతోన్మాద మత్తులో ఉంచి కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తుందని అన్నారు. 2014 నుంచి నిత్యావసర సరుకుల ధరలు అనేక రెట్లు పెంచి ప్రజల వద్ద దోపిడీ చేసిన సొమ్మును తమ మద్దతు ఉన్న ఆదాని, అంబానీ అనే గుత్త పెట్టుబడిదారులకు ముట్టచెబుతున్నదని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ రైతు వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చే రైతాంగాన్ని, కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చి కార్మిక వర్గాన్ని మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో ఉన్న టీడీపీ, వైసీపీ, జనసేనకి అధికారకాంక్ష తప్పితే ప్రజల సంక్షేమం, ప్రజా ప్రయోజనాలు, విభజన హామీలు, రాష్ట్ర ప్రయోజనాలు గురించి పట్టటం లేదని అన్నారు. వారు మోడీ ప్రాపకం కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ మాట్లాడుతూ ఎన్నికల ముందు దేశంలో యువతకు ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానన్న కేంద్ర ప్రభుత్వం గత తొమ్మిదేళ్లలో కేవలం 50 లక్షల ఉద్యోగాలు మాత్రమే కల్పించిందని దేశానికి తలమానికమైన ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా తన మద్దతుదారులుగా ఉన్న కార్పొరేట్లకు ముట్టచెబుతుం దని విమర్శించారు. సీపీఐ ఏరియా కార్యదర్శి మంద పాటి రమణారెడ్డి మాట్లాడుతూ మోదీని, మోడీకి మద్దతు ఇస్తున్న పార్టీలను తరిమివేయాలని, మతో న్మాద, అవకాశవాద రాజకీయ పార్టీలకు వ్యతిరే కంగా కమ్యూనిస్టులు పోరాటాలు చేయటానికి ఎప్పు డూ ముందుంటారని, ప్రజా శ్రేయస్సు కోసం ఉద్యమాలు మరింత ఉధృతం అవ్వాలని పిలుపునిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి ఆంజనేయరాజు మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన నూతన విద్యా విధానం పేద పిల్లలను బడి నుంచి దూరం చేయడానికి తీసుకొచ్చిన దారుణమైన చట్టమని అందరికంటే ముందు మన రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం దాన్ని అమలుకు పూనుకున్నదని దానివల్ల ఇప్పటికే వేల పాఠశాలలు రాష్ట్రంలో మూతపడ్డాయని అన్నారు. రాష్ట్రంలో విద్య పూర్తి స్థాయిలో ప్రైవేటీకరణకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని విద్యార్థులు అందరూ కలిసి ఈ వ్యతిరేక విధానాలను అడ్డుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొమర వెంకట్రావు, ఎడ్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మే డే ర్యాలీ జయప్రదం చేయండి

పల్నాడు జిల్లా ఏఐటీయూసీ కన్వీనర్ కాసా రాంబాబు

విశాలాంధ్ర-నరసరావుపేట : పట్టణంలో సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 137వ మే డే కార్యక్రమంలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా ఏఐటీయూసీ కన్వీనర్ కాసా రాంబాబు పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక వర్గానికి చిరస్మరణీయమైన రోజు మేడే అని, 1886వ సంవత్సరంలో చికాగో నగరంలో కార్మిక వర్గం 8 గంటల పని దినం కోసం జరిపిన పోరాటం ప్రపంచగతిని మార్చిందన్నారు. ఈ పోరాటపు వెలుగు కిరణం ప్రపంచమంతా నలుమూలలకు పాకి 137వ మే డే దినోత్సవాన్ని కార్మిక వర్గం నిర్వహించుకుంటుందని కాసా రాంబాబు తెలిపారు. ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 8 గంటల పని దినం కోసం లక్షల మంది కార్మికులు తమ రక్తాన్ని చిందించి తమ రక్తంతో తడిచిన ఎర్ర చొక్కాను ఎగరవేసి సాధించిన కార్మిక హక్కును మేడే గా అప్పటి నుంచి ఇప్పటి వరకు కార్మికులు ఎర్రజెండా నీడన తమ హక్కులను సాధించుకుంటూ ముందుకు సాగుతున్నారని అన్నారు. కార్మికుల పోరాట శక్తిని చూసి పెట్టుబడిదారులందరూ పెంబెలెత్తిపోయారని, పెట్టుబడిదారుల అండగా ఉన్న ప్రభుత్వం మే 3వ తేదీన శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మిక సమూహాలపై పోలీసులతో కాల్పులు జరిపి ఆరుగురు కార్మికులను బలి తీసుకుందని తెలిపారు. ఆ ప్రాంతమంతా రక్తంతో తడిసి కార్మికులు చిందించిన రక్తం నుంచి ఎర్ర జెండా పురుడు పోసుకుందని, కార్మికులంతా ఎర్రజెండానే మా జెండా అని ప్రకటించడం ఆ రోజే జరిగిందని అన్నారు. అలాగే భారతదేశంలో కార్మిక వర్గం ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను హరించే విధంగా మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరించడం పట్ల కార్మికుల్లో ఆందోళన వ్యక్తం అవుతున్నాయని, కార్మిక వర్గ హక్కులను హరించే విధంగా కీలకమైన చట్టాలను సవరించడం బిజెపి ప్రభుత్వానికి అత్యంత సిగ్గుచేటని దుయ్యపడ్డారు. దీర్ఘకాలంగా ఉన్న 44 కార్మిక చట్టాలను నాలుగు చట్టాలుగా కుదించి వేసి కార్మిక సంఘాలతో రాజ్యాంగ నిబంధనలు కార్మిక వర్గ సమస్త ఒప్పందాలను అతిక్రమించి కార్మిక వ్యతిరేక విధానాలను మోడీ ప్రభుత్వం అనుసరిస్తుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైనటువంటి ఎల్ఐసి, రైల్వే, బిఎస్ఎన్ఎల్, సింగరేణి, బీహెచ్ఈఎల్ వాటితో పాటు విద్యార్థుల బలిదానంతో లెఫ్ట్ పార్టీ ఎమ్మెల్యేల, ఎంపీల పదవి త్యాగంతో సాధించుకున్నటువంటి విశాఖ ఉక్కు పరిశ్రమలు కూడా తెగనమ్మడానికి మోడీ ప్రభుత్వం సిద్ధపడుతుందని అన్నారు. ఈ ప్రభుత్వాల ప్రమాదకర చర్యలను కార్మిక వర్గం ఇక ఉపేక్షించ బోధని ముక్తకంఠంతో ఖండిస్తూ కార్మిక శక్తులన్నీ ఒక తాటిమైకు వచ్చి ఉధృతమైన పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో మే 1వ తేదీన నరసరావుపేట పట్టణంలో ఉదయం 9 గంటలకు మేడే దినోత్సవాన్ని పురస్కరించుకొని సీపీఐ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించబోతున్నామని, ఈ ర్యాలీలో కార్మికులు, కర్షకులు, పార్టీ కార్యకర్తలు వందలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న జగన్ ప్రభుత్వం

50వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి
ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-నరసరావుపేట : అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి సంవత్సరం ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామని చెప్పిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నేడు వాటి భర్తీ పట్ల నిర్లక్ష్యం చేయడం ద్వారా నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారని ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ సుభాని అన్నారు. నరసరావుపేట పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సుభాని మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్లు ఇచ్చి ఏయే నెలల్లో ఉద్యోగాలు భర్తీ చేస్తామో నోటిఫికేషన్ ఇస్తామని చెప్పిన జగన్‌మోహన్ రెడ్డి నాలుగు సంవత్సరాల నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. బీఈడీ, టీటీసీ అభ్యర్థులు నిరాశ గురవుతున్న నేపథ్యంలో ఖాళీగా ఉన్న 50వేల ఉపాధ్యాయ పోస్టు భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సచివాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, సబ్ రిజిస్ట్రర్లు, డిప్యూటీ తహశీల్దారు, గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు శ్వేత పత్రం విడుదల చేసి నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెలా నాసర్ జీ మాట్లాడుతూ సుమారు 20వేలకు పైగా ఉన్న ఎస్సై కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ చేసి పోలీసులుపై పని భారం తగ్గించాలని, రాష్ట్రంలో శాంతి భద్రతల అదుపులో ఉంచేందుకు పోలీసు ఉద్యోగాల భర్తీ ప్రధాన కర్తవంగా ప్రభుత్వం తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో ప్రతి వస్తువు కల్తీ అయిన నేపథ్యంలో కల్తీ ఆహారాల నియంత్రణ కోసం కేవలం 19 మంది మాత్రమే ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉన్నారని, మండలానికి ఒక ఫుడ్ సేఫ్టీ అధికారిని నియమించి కల్తీ ఆహార పదార్థాలు నియంత్రించే ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భక్తి కోసం అన్ని విద్యార్థి యోజన సంఘాలు ఐక్య కార్యాచరణలతో ఉద్యమ బాట పట్టేందుకు నిరుద్యోగులు సిద్ధమవుతున్నారని, ప్రభుత్వం మేల్కొని మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. స్వయం ఉపాధి కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్‌లకు అధిక నిధులు కేటాయించి వడ్డీలేని రుణాలు ధార ఉపాధి కల్పనకు ప్రత్యేక చూపాలని, లేని పక్షంలో ఉపాధి చూపించలేని నామమాత్ర కార్పొరేషన్‌లు నిలిచిపోతాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి గుండాల శ్రీ హర్ష, ఏఐఎస్ఎఫ్ నాయకులు శశి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్.. గ్రామ స్థాయికి తీసుకెళ్లాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లాలో ప్రభుత్వం ద్వారా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానం గ్రామాల్లోని క్షేత్ర స్థాయి వరకు తీసుకు వెళ్ళాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో జిల్లా, మండల స్పెషల్ ఆఫీసర్స్, మెడికల్ ఆఫీసర్స్‌తో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలపై అధికారుల అంతర్గత సమీక్ష వీడియో కాన్ఫరెన్సు ద్వారా నిర్వహించారు. సమావేశంలో ప్రధానంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానం అమలు అవుతున్న 39 ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఏ.ఎన్.ఎం.యాప్ ఎలా పని చేస్తున్నదని అడిగి తెలుసుకున్నారు. అన్ని ప్రాంతాల్లో వైద్య విధానాలు పేద ప్రజలు అందరికీ చేరువ కావాలని జిల్లా కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. వైద్య విధానంలో ఉన్న సేవలన్నిటిని ఉపయోగించాలని ఆదేశించారు.ఆడపిల్లలు, యువతులు, మహిళల్లో గర్భవతులు, బాలింతలు రక్తహీనత శాతం తగ్గించేందుకు చర్యలు తీసుకోవాల న్నారు. వారు తగినంత పౌష్టికాహారం స్వీకరించేలా కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వమే పౌష్టికాహారం అందిస్తుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని పారదోలుదాం... దేశాన్ని కాపాడుకుందాం...

విశాలాంధ్ర-శావల్యాపురం: దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రధాని మోడీ నాయకత్వంలో అదాని, అంబానీ లాంటి అతి సంపన్నులకు దేశ సంపదను కేంద్ర ప్రభుత్వం దోచి పెడుతుందని, ప్రతి వ్యక్తి గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీసి, మోడి ప్రభుత్వాన్ని సాగనంపాలని సీపీఐ వినుకొండ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు అన్నారు. మోడీనీ గద్దె దించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో మండలంలోని వేల్పూరు, కారుమంచి, పిచికలపాలెం, పొట్లూరు, శావల్యాపురం తదితర గ్రామాల్లో సీపీఐ, సీపీఎంల అధ్వర్యంలో ప్రచార భేరి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మోడీ రాజ్యాంగాన్ని అవహాస్యం చేసి దేశంలో మతోన్మాద దాడులు చేస్తూ ప్రశ్నించే వారి మీద దేశం ద్రోహం కేసులు పెట్టి స్వేచ్ఛా హక్కును కాలరాస్తున్నారని అన్నారు. దేశంలోని ప్రభుత్వం రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి అన్ని రంగాలు అదానీ చేతిలో ఉండేలా వ్యవస్థలను తీసుకువచ్చాడని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తుందని, మోడీ పాలనకు చరమగీతం పాడుతామన్నారు. సిపిఐ నియోజకవర్గ కమిటీ సభ్యులు పిన్నబోయిన వెంకటేశ్వర్లు, కొప్పరపు మల్లికార్జునరావు, సోదాల సాంబయ్య, షేక్ మస్తాన్, రాచపూడి మరియబాబు, శోభన్ బాబు, ఆదిలక్ష్మి, దయామని, రాంబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉద్యమ జ్వాల వావిలాల

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రజా సమస్యలుపై అలుపెరగకుండా 8 దశాబ్దాలు పాటు అవిశ్రాంత పోరాటం జరిపిన మహోన్నత గాంధేయ వాది, ఉద్యమ జ్వాల వావిలాల గోపాలకృష్ణయ్య అని అవగాహన సంస్థ కార్యదర్శి కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. వావిలాల గోపాలకృష్ణ వర్ధంతి సందర్భంగా స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో వావిలాల చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శివరామిరెడ్డి మాట్లాడుతూ ఆనాటి స్వాతంత్ర్య ఉద్యమం, ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం, విశాలాంధ్రోద్యమం, గ్రంథాలయోద్యమం, భూమిశిస్తు పెంపుదల వ్యతిరేక ఉద్యమం, రైతాంగ ఉద్యమం లాంటి అనేక ఉద్యమాలతో మధ్య నిషేద ఉద్యమాన్ని నిర్వహించిన గొప్ప ఉద్యమకారుడు వావిలాల అని కొనియాడారు. ప్రముఖ నాటక రచయిత కాపూరి సత్యన్నారాయణ మాట్లాడుతూ వావిలాల స్పృశించని రంగం, ఆయనకు తెలియని సమస్యల, చదవని విషయం, అసెంబ్లీలో ఆయన వేయని ప్రశ్న ఉండదని హేమాహేమీలు ప్రశంసించేవారన్నారు. యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడుతూ వంశధార, నాగార్జున సాగర్, పోచంపాడు, శ్రీశైలం ప్రాజెక్టుల సాధనలో వావిలాల కృషి శ్లాఘనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, సుబ్బారెడ్డి, హనుమంతరావు తదితరులు ఉన్నారు.

స్వపక్షంలో విపక్షం..

సమస్యలపై గలమెత్తిన అధికార పార్టీ సభ్యులు
సాయికార్తీక్ కాంప్లెక్స్ వివాదంపై కొనసాగిన చర్చ

విశాలాంధ్ర-చిలకలూరిపేట: అధికార పక్షంలోని కౌన్సిలర్లే తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవటం లేదని గళమెత్తని సంఘటన శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో చోటు చేసుకుంది. మున్సిపల్ అత్యవసర సమావేశం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత జరిగింది. అనధికార కుళాయిల క్రమబద్దీకరణ, పెరుగుతున్న కుక్కుల సమస్యలు, పట్టణంలోని సాయి కార్తీక్ కాంప్లెక్స్ యజమానిపై వేధింపులు ఇలా అనేక అంశాలు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో హైలెట్‌గా నిలిచాయి.

సమావేశంలో ఎజెండా చదవడం పూర్తి అయిన వెంటనే పసుమర్రుకు చెందిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ జాలాది సుబ్బారావు మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుండి తమ ఊరికి ఏ పని అడిగినా చేయటం లేదని.... మేము ఉండాలా వెళ్లిపోవాలా... అని చైర్మన్ ను నిలదీశారు. మున్సిపల్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మస్తాన్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ స్మశాన వాటిక వద్ద నాలుగు ట్రక్కుల మట్టి అడుగుతుంటే చేయటం లేదు. మీ మీ ఇష్టం వచ్చిన చోట్ల పని చేస్తున్నారుగా అని చైర్మన్ ను అసంతృప్తితో ప్రశ్నించారు. ఇదే క్రమంలో అనధికార కుళాయిలు క్రమబద్ధీకరణ చేయటానికి రూ.5వేలు కేటాయించాలని సీపీ సభ్యులు తీర్మానించారు.

సాయి కార్తీక్ వ్యవహారంపై వాడి వేడి చర్చ...

టీడీపీ ప్రతిపక్ష నేత గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ శుక్రవారం చిలకలూరిపేట పురపాలక సంఘంలో సాయి కార్తీక్ సిటీ సెంటర్ గురించి విలేకరుల సమావేశం పెట్టి మరి సాయి కార్తిక్ సిటీ సెంటర్ అతనికి కొన్ని పర్మిషన్ లేవని చెప్పడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వారికి 2014లోనే అన్ని పర్మిషన్లు మున్సిపాలిటీ ఇచ్చిందని తెలిపారు. కేవలం సాయి కార్తీక్ సిటీ సెంటర్ 50 కోట్ల రూపాయల ఆస్తిని 10 కోట్లకి కొట్టాలని కొందరు పన్నాగం పన్నారని ఈ విషయం ఆ యజమాని బహిరంగంగా తెలిపారన్నారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులకు ఏం సంబంధం అని గంగా శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఈ విషయంపై చైర్మన్ సమాధానం చెబుతూ సంజీవ్ నగర్ లో వర్షాలు వచ్చినప్పుడు నీరు నిలిచిపోతుందని అందువల్ల సాయి కార్తిక్ సిటీ సెంటర్ ఎదురుగా కాలువలోని సిల్ట్ తీసామన్నరు. సాయి కార్తీక థియేటర్ ముందు వేసింది ఐదు అడుగుల పైపులు పక్కన ఉన్న వారి పైపులు ఎన్ని అడుగులో మీడియా సమక్షంలో చూద్దాం రండి..ఇప్పుడు వర్షాలు లేవు సాయి కార్తీక ముందు పైపులు తీశారు అయినా నీళ్లు పోవాటం లేదు...వెళదాం రండి..చూద్దుమని నిలదీశారు..కార్తీక థియేటర్ ముందు పైపులు పగల గొడితే సంజీవ్ నగర్ లోని నీళ్లు ఎలా వెళుతాయి థియేటర్ నుండి అద్దరోడ్డు వరకు పగల గొట్టాలి కదా.. ఇప్పుడు నెల నుండి వర్షాలు లేవు..అయినా ఆ కాల్వలలో నీరు వెళ్ళటం లేదు పూడికలు ఎందుకు తీయటం లేదని ప్రశ్నించారు సంబంధిత అధికారులు 10 రోజుల్లో సరి చేస్తారని చైర్మన్ తెలిపారు.కుక్కలు వెంటపడుతున్నాయి... కుక్కలకు నేను కౌన్సిలర్ అని తెలియదు కదా.... ఈ విషయంలో అనేకమంది కౌన్సిల్ సభ్యులు బాధపడుతున్నారు. వెంటనే పరిస్థితి చక్కదిద్దండని 10వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ బేరింగ్ చెప్పడంతో విపక్ష సభ్యులు మౌలాలి చెప్పిన విషయం నిజమే.... మేమంతా కుక్కల బారి నుంచి తప్పించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీకి చెందిన మరో సభ్యురాలు మాట్లాడుతుండగానే చైర్మన్ సభను ముగించారు.

మేడే ఘనంగా నిర్వహించండి

విశాలాంధ్ర-పెదకూరపాడు: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేని పెదకూరపాడు నియోజకవర్గంలో వాడవాడల ఘనంగా నిర్వహించలని పెదకూరపాడు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అన్నారు. శనివారం పెదకూరపాడు లో ఏర్పటు చెసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 8 గంటల పనిదినాల కోసం చికాగో నగరంలో ఉవ్వెత్తున సాగిన ఉద్యమం ఫలితంగా ఉద్భవించినది మే దినోత్సవం ఎర్రజెండా అండగా శ్రమ దోపిడిపై సమర శంఖం పూరించిన కార్మిక వర్గం ఎనిమిది గంటల పనిదినాలు సాధించుకున్నదని తెలిపారు. గ్రామ గ్రామాన వాడవాడలో ఎర్రజెండా ఎగరేయాలని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్యదర్శి టి ప్రసాద్, సుధాకర్, నాగేశ్వరరావు, రత్నబాబు, ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే పండుగను వాడవాడలా ఏఐటీయూసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చిలకలూరిపేట నియోజకవర్గ సిపిఐ ఏరియా ఇన్చార్జి కార్యదర్శి నాగ వైరు రామసుబ్బాయమ్మ శనివారం తెలిపారు . ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్, సివిల్ సప్లై యూనియన్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, ఆటో ట్రాలీ వర్కర్స్ యూనియన్, సిమెంటు ఐరన్ రిక్షా వర్కర్స్ యూనియన్, యూనియన్ నాయకులను కలిసి మేడే కరపత్రాలను పంపిణీ చేశారు. ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాలతో ఆమె సమావేశమయ్యారు. కార్యక్రమ వివరాలను తెలియజేస్తూ మేడే పండుగను కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే ఒకటో తేదీన ఉదయం అరుణ పతాకాలను ఆవిష్కరించి అనంతరం స్థానిక నరసరావుపేట సెంటర్లోని సిపిఐ కార్యాలయం నుంచి పట్టణ పురవీధుల గుండా కళామందిర్ సెంటర్ వరకు ప్రజా ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి అనుబంధ కార్మిక సంఘాలు, నాయకులు, కార్యకర్తలు, అసంఘటిత రంగ కార్మికులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటియుసి ఏరియా అధ్యక్షులు పేలూరి రామారావు, నాయకులు నాయుడు శివకుమార్, ఆరాధ్యుల రామకృష్ణ, బొంతా భగత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారభేరి ముగింపు సభ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-నరసరావుపేట: వామపక్ష రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించిన ప్రచార బేరి ముగింపు సందర్భంగా ఆదివారం సీపీఐ కార్యాలయంలో నిర్వహిస్తున్న ముగింపు సభను జయప్రదం చేయాలని వామ పక్షాల నాయకులకు, కార్మికులకు సిపిఐ, సిపిఎం పార్టీలు నాయకులు పిలుపునిచ్చారు. నరసరావుపేట ఏంజెల్ టాకీస్ సెంటర్ లోని సిపిఐ కార్యాలయంలో ఆదివారం ఉదయం పది గంటలకు సభ జరుగుతుంది. నియోజకవర్గ పరిధిలోని ప్రజానీకం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సిలార్ మసూద్, సిపిఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్ కోరారు. నర్సరావుపేట మండల కమిటీ కార్య దర్శి మేడం ఆంజనేయులు, సయ్యద్ హుస్సేన్, మస్తాన్వలి పాల్గొన్నారు.

అన్నదానం మహా గొప్పకార్యం....

విశాలాంధ్ర-వినుకొండ: అన్నదానానికి మించిన దానం మరొకటి లేదని ప్రముఖ సీనియర్ న్యాయవాది మాజీ ఏజీపీ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. బొల్లా వెంకట కోటయ్య. సత్యవతి. ఫౌండేషన్. వ్యవస్థాపకులైన బొల్లా శ్రీనివాసరావు. అధ్యక్షులు రమేష్ బాబు (బి.వి.కె.యస్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో. శనివారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ సీనియర్ న్యాయవాది. మాజీ ఏజీపీ యలవర్తి శ్రీనివాసరావు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యలవర్తి మాట్లాడుతూ అన్నదానం మహా గొప్ప కార్యక్రమం అని అన్నదానానికి మించి మరొకటి లేదని. పేదల ఆకలి తీర్చడంలో ఉన్న సంతృప్తి దేనిలో రాదని ఆయన అన్నారు. ఈ ఫౌండేషన్ పేదలు ఎక్కడ ఉంటే అక్కడకు చేరుకొని అన్నదాన కార్యక్రమం నిర్వహించడం పట్ల సమాజంలో మంచి గుర్తింపు పొందుతున్నారని యలవర్తి ఫౌండేషన్ను ప్రశంసించారు. ఈ ఫౌండేషన్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వాలు పేదల ఆకలి ఏమాత్రం తీర్చడం లేదని. ప్రజా ప్రతినిధులు వారి వారి స్వార్థ ప్రయోజనాలే చూసుకుంటూ పేదల ఆకలని విస్మరిస్తున్నారని. ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు, నజీర్, సైదులు, న్యాయవాది చంద్రం, మల్లికార్జున్, శ్రీకాంత్, నరేంద్ర, వినోద్, శివ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత

విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు పట్టణంలోని హర్ష స్కూల్ వారు నిర్వహించిన పిల్లల చదువుల మరియు ఇతర నైపుణ్యాలలో ప్రావీణ్యం ప్రదర్శించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు మరియు మెడల్స్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ షకిలా దస్తగిరి ఈ కార్యక్రమంలో హర్ష స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసుల మరియు వారి యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

పన్ను రాయితీకి ఆదివారం ఒక్క రోజే గడువు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఆస్తి, ఖాళీ స్థల పన్నును ఏక మొత్తంగా చెల్లించే వారికి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 5 శాతం రాయితీకి ఆదివారం ఒక్కరోజే గడువు ఉందని, నగర ప్రజల సౌకర్యార్థం గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లో వినియోగించుకోవాలని కోరారు.

మహారాజశ్రీ గురజాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.పీ.నెం : 16/2023

మోరబోయిన వెంకట్రావమ్మ - పిటిషనరు

వరఫ్ వెంకట్రాములు భర్త ఆంజనేయులు సా॥ మరియు, కారంపూడి (మం) పల్నాడు జిల్లా

వర్సెస్

పత్రాల రామిరెడ్డి వగైరా - రెస్పాండెంట్లు

పై నెంబరులో పిటిషనరు తనను ఇన్‌స్వాలెంట్ (దివాళాకోరు)గా నిర్ధారించ మని పై కోర్టులో దాఖలు చేసి నందున ఇట్టి విషయమై ఎవ్వరికైనా, ఎలాంటి అభ్యంతరములు వున్నా ది.10-05-23న పై వారి కోర్టులో ఉదయం 10.30 గం॥ల నుండి స్వయంగా లేదా తమ అడ్వకేట్ ద్వారా హాజరులో వుండి తమ అభ్యంత రములు తెలుపుకొనవలెను. లేని యెడల వారి పరోక్షమందు కేసు తీర్మానించబడును.

వాయిదా తేది : 10-05-2023

// బై కోర్టు ఆర్డర్//

యతిరాజు వెంకటేశ్వర్లు, అడ్వకేట్, గురజాల

సెల్ : 7981373694

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలను గద్దె దింపుదాం

సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - సంతమాగులూరు : ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న మోదీ, జగన్ ప్రభుత్వాలను గద్దె దింపుదామని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తెలిపారు. మండలంలోని ఏల్చూరు గ్రామంలో సీపీఐ, సీపీఎం ప్రచారభేరి యాత్ర నిర్వహించారు. వామపక్ష నాయకులు గ్రామంలో పర్యటించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దుష్టపాలన సాగిస్తున్నారని చరమగీతం పాడి దేశాన్ని రక్షించుకోవాల్సిన అవశ్యకత ఎంతైన ఉందన్నారు. ప్రశ్నించే గొంతుక అణిచివేతకు గురవుతుందని ఆవేదన వ్యక్తపరిచారు. ఎంతోమంది మహనీయుల త్యాగాలతో దేశానికి స్వాతంత్రం సంపాదించుకున్న నేడు దేశం పెను ప్రమాదంలో పడిపోయిందని ఆయన దుయ్యబట్టారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. మోదీ బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మత చిచ్చు పెట్టి రెచ్చగొడుతుందని విమర్శించారు. దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తుల పంచనకు చేరవేస్తోందని ఘాటుగా స్పందించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ, అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు దారాదత్తం చేస్తుందని విమర్శించారు. 2024లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంబేద్కర్ రాజ్యాంగం లేకుండా చేస్తారని తెలిపారు. మోదీ ప్రభుత్వం మతతత్వ దోరణలు రెచ్చగొడుతూ, ప్రజసమస్యలపై ప్రశ్నించకుండా ప్రజలు ఐక్యం కాకుండా చేయడానికి ఎక్కడికక్కడ మతకలహాలు వివాదాలు రేపుతుందన్నారు. రాష్ట్రంలో జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. రాష్ట్రంలో పోలీసుల రాజ్యం, హంతకుల రాజ్యం, బెదిరింపుల రాజ్యం నడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని తెలిపారు. ఏపీలో వైసీపీ, టీడీపీ, జనసేనలు బీజేపీకి మద్దతుగా నిలుస్తున్నాయని ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని రాబోయే ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని సాగనంపి దేశాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్, సీపీఐ మండల కార్యదర్శి ఏసోబు, నాగేశ్వరరావు, ఖాదర్ బాషా, రమణయ్య, షంషూన్, బి.చింతలయ్య పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని సాగనంపాలి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : ప్రజలపై పెను భారాలను మోపుతున్న మతోన్మాద బీజేపీని సాగనంపాలని కోరుతూ సీపీఐ, సీపీఎంల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రమైన చెరుకుపల్లిలో తహశీల్దార్ కార్యాలయం నుంచి కోటి సెంటర్, అంబేద్కర్ విగ్రహం వరకు కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గొట్టుముక్కల బాలాజీ, సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ది పొందాలని చూస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా పనిచేస్తుందని ప్రజలందరూ ఐక్యంగా ఉండి మోదీని సాగనంపాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం ప్రత్యేక హోదా, పోలవరం నిధులు, రాజధాని నిర్మాణం, రైల్వే జోన్, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజ్ పార్లమెంట్ సాక్షిగా విభజన చట్టంలో ఇచ్చినా హామీలు ఏ ఒక్క దాన్ని అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో అనేక త్యాగాలు ద్వారా సాదించుకున్న విశాఖ ఉక్కుని అదానీకో జిందాల్ కో మరో కార్పొరేట్ కంపెనీకో కట్టబెట్టడానికి కేంద్రం కుట్ర చేస్తుంటే రాష్ట్రప్రభుత్వం కూడా మెతక వైఖరి అవలంబిస్తూ ప్రజలని మోసం చేస్తున్నారని విమర్శించారు. అనేక మతాలు కులాలు, భాషల సంస్కృతితో కూడిన భారతదేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపై ఉందని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో సీపీఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బందారు శ్రీనివాసరావు, సీపీఎం మండల కార్యదర్శి కె.శరత్, సీపీఐ, సీపీఎం నాయకులు ఎ.విష్ణు నారాయణ, సాంబయ్య, పోలేరమ్మ, అదిమ్మ, వెంకటేశ్వర్లు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టూరిజం హబ్‌గా సూర్యలంక: మంత్రి

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల సూర్యలంక ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా నెలకొల్పుతామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్.కె రోజా తెలిపారు. బాపట్ల మండలం అడవిపల్లిపాలెంలో వి రిసార్ట్స్‌ను మంత్రి రోజా,ఎమ్మెల్యేలు కోన,బలరాంలు శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా రోజా సూర్యలకం తీరం పర్యాటక ప్రదేశంగా విస్తరించడానికి మెరుగైన అవకాశాలు ఉన్నాయన్నారు. సూర్యలంక ప్రాంతంలో ఉన్న 25 ఎకరాల అటవీశాఖ భూముల్లో రిసార్ట్స్ నిర్మించడానికి ఇటీవల భూములు పరిశీలించినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన డిపిఆర్ ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. సూర్యలంక హరిత రిసార్ట్స్‌లో మరో నాలుగు అదనపు సూట్స్ రూంలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో బాపట్ల,చీరాల పట్టణాలు రాబోయే రోజుల్లో జంటనగరాలుగా తయారవుతాయని తెలిపారు. బాపట్ల నుండి ఆడవిపల్లెపాలెం మీదుగా జాతీయ రహదారి 216 వరకు 4 లైన్‌ల రహదారి నిర్మాణానికి రూ.135 కోట్లతో నిర్మించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆమోదించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం కృష్ణమూర్తి, చీరాల వైసిపి నియోజకవర్గ ఇంచార్జీ కరణం వెంకటేష్, వి రిసార్ట్స్ ప్రతినిధి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అవుట్‌పోస్ట్ ప్రారంభం

విశాలాంధ్ర - వేటపాలెం : పర్యాటక ప్రాంతాలు, పుణ్య క్షేత్రాలలో ప్రజల భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం టూరిస్ట్ పోలీస్ స్టేషన్‌లను ఏరాృటు చేస్తుందని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. వేటపాలెం మండలం రామాపురం బీచ్ వద్ద నిర్మిస్తున్న టూరిస్ట్ పోలీస్ ఔట్ పోస్ట్‌ను ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామాపురం బీచ్ వద్దకు విచ్చేసే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తినా పోలీస్ సిబ్బంది తక్షణ సహాయం అందిస్తూ 24 గంటలు అందుబాటులో ఉండేవిధంగా టూరిస్ట్ పోలీస్ ఔట్ పోస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీచ్ పరిసరాలపై పటిష్ట నిఘా ఉంచడానికి వాచ్ టవర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నామని వీటిని త్వరలో ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. చీరాల డీఎస్పీ పి.శ్రీకాంత్, ఎస్.బి సీఐ ఏ.శ్రీనివాస్, చీరాల రూరల్ సీఐ ఏ.మల్లికార్జున, చీరాల రూరల్ ఎస్సై జనార్ధన్ పాల్గొన్నారు.

నాగేశ్వరరావును పరామర్శించిన చైతన్య

విశాలాంధ్ర -బల్లికురవ : మండల పరిధిలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామ సర్పంచి భర్త పసల నాగేశ్వరరావు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతూ నరసరావుపేటలోని సిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. శనివారం శాప్ నెట్ చైర్మన్ అద్దంకి నియోజకవర్గం వైఎంఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాచిన కృష్ణ చైతన్య నాగేశ్వరావు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట జిల్లా రైతు అధ్యక్షులు, సంతమాగులూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చింతల పేరయ్య తదితరులు ఉన్నారు.

జగనన్నే మా భవిష్యత్ విజయవంతం

విశాలాంధ్ర-పర్చూరు: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం విజయవంతం చేసిన ప్రతి కార్యకర్త సేవలు అభినందనీయమని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ తెలిపారు. అద్దంకి నాంచారమ్మ కళ్యాణమండపం నందు శనివారం ఆమంచి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి వైసీపీ ప్రభుత్వానికే సాధ్యమని తెలిపారు. దీనికి ముందు కారంచేడు నుండి బైక్‌లు, కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బొమ్మల సెంటర్‌కు చేరుకొని వైఎస్సార్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కటారి అప్పారావు, నీరుకట్టు వాసుబాబు, జువ్వా శివరామప్రసాద్, తోకల కృష్ణమోహన్, కోటా హరిప్రసాద్, కోటా శ్రీనివాసరావు, ఆకుల హేమంత్, జంగా అనిల్, ముప్పాళ్ళ రాఘవయ్య, తులసి నాగమణి, గోరంట్ల శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-పర్చూరు: రోటరీ ఆధ్వర్యంలో బొమ్మల సెంటర్‌లో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రంను వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ ప్రారంభించారు. రోటరీ సేవలను అభినందించారు. రోటరీ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు, పాబోలు ఉదయభాస్కర్, గడ్డిపాటి శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రం, తోకల కృష్ణమోహన్ ఉన్నారు.

ఏఆర్ఎంలో తల్లిదండ్రుల సమావేశం

విశాలాంధ్ర - చీరాల : ఆంధ్ర రత్న పురపాలక ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యా సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో తల్లిదండ్రుల సమావేశం శనివారం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులని సర్టిఫికెట్‌లు, బహుమతులతో సత్కరించారు. ప్రధానోపా ధ్యాయులు బి.సాల్మన్ రాజు, పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు డి.యదాలమ్మ, కోఆప్షన్ సభ్యులు మునీరుల్లా ఖాన్, ఉపాధ్యాయులు కె రాజేంద్రప్రసాద్, వై.గాంధీ, చంద్రశేఖర్, భానుచంద్రమూర్తి, సిహెచ్ మాధవి, శివప్రసాద్, ప్రసన్నకుమారి, సీఆర్పీ ధనలక్ష్మి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర - వేటపాలెం : వేటపాలెంలోని రామన్నపేటలో జనసేన ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ స్ఫూర్తితో శనివారం అన్నదాన కార్యక్రమం జనసేన సైనికుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వేటపాలెం ఎస్సై జి.సురేష్ హాజరయ్యారు. కార్యక్రమంలో పసుపులేటి సాయి బి వరం బుద్ధి శివకిరణ్ మాచర్ల నవీన్ పింజల సాంబశివరావు కోలా అశోక్ చౌదరి కాపు సంక్షేమ సేన మహిళ జిల్లా అధ్యక్షురాలు కారంపూడి పద్మిని వీర మహిళ కాటన్ గారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు

మీ కుటుంబ సభ్యుడిలా ఆదరించండి

టీడీపీ ఇన్‌చార్జి వేగేశన

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : రాబోయే ఎన్నికల్లో బాపట్ల నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, నన్ను మీ కుటుంబ సభ్యుడిలా భావించి ఆదరించాలని బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ఇంటింటికీ తెలుగుదేశం, మీ మాట - నా బాట కార్యక్రమంలో భాగంగా శనివారం పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు గ్రామంలోని పెద్ద హరిజనవాడలో తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ విధానాలను ప్రజలకు వివరించారు.మహిళలకు చీర, నిత్యావసర వస్తువులు తెచ్చుకునే సంచి, తన గురించి తెలియజేసే కరపత్రాన్ని అందజేసి ఆశీర్వదించాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గ ప్రజలకు అండగా మా వేగేశన ఫౌండేషన్ ద్వారా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ అందరికీ చేరువయిన విషయం అందరికీ తెలుసని అన్నారు.అవినీతి, లంచాలకు తావులేని వ్యవస్థలను నిర్మించి కలిసికట్టుగా మన బాపట్లను అభివృద్ధి చేస్తానని చెప్పారు.తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే బాపట్ల నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి అండగా నిలుస్తానని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఎండి అఫ్జల్, పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షుడు ఖాసీం, మండల టిడిపి మహిళా అధ్యక్షురాలు గ్లోరియా యానెట్, గ్రామ పార్టీ అధ్యక్షుడు రజాక్, టిడిపి నాయకులు మీరా, నిజాం, మరియదాసు, వెంకటరావు, ఫెడ్రికే, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ సేవలను గ్రామీణులు సద్వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) ఎస్ఎల్ఎంపీ ప్రసాద్ పేర్కొన్నారు.ఎస్బీఐ నిజాంపట్నం బ్రాంచ్ ఆధ్వర్యంలో బావాజీపాలెంలో రాత్రి శిబిర్ కార్యక్రమం నిర్వహించారు.ఆర్ఎం ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామీణులు పగలు తమ పనులతో దుబాటులో ఉండరని, అందువల్ల ఈ కార్యక్రమాన్ని రాత్రిళ్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.దీని ద్వారా ఎస్బీఐ సేవల పై ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించేందుకు అవకాశం ఉందని చెప్పారు. బ్యాంకు సేవలు, రుణ సదుపాయాలను ప్రజలకు వివరించినట్లు తెలిపారు. ఎస్బీఐ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.బ్రాంచ్ మేనేజర్ కె.దామోదర రాజారావు, ఏపీఎం కృపాసాగర్, సీసీ దేవి ప్రసన్న పాల్గొన్నారు.

సమష్టి కృషితో విజయం తథ్యం

విశాలాంధ్ర - రేపల్లే : సమిష్టి కృషితో రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనూహ్య విజయం సాధిస్తుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు గడ్డం రాధ కృష్ణమూర్తి జ్యోస్యం చెప్పారు. కార్యాలయంలో శనివారం జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని కొనియాడారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించిందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన బాగుందని, పదే పదే ఆయనే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు జి.ప్రశాంత్ కుమార్, టివికె గుప్త మాట్లాడుతూ రాష్ట్రంలో పండుగ వాతావరణం నెలకొందన్నారు. 7 లక్షల మంది పార్టీ సభ్యులు అందరూ రాష్ట్రవ్యాప్తంగా కోటి 40 లక్షల కుటుంబాలను కలసి, కోటి 10 లక్షల మిస్డు కాల్స్ ఇచ్చినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో జగన్‌కు ప్రజలు అండగా ఉంటామని హామీ ఇచ్చారన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

విశాలాంధ్ర-అద్దంకి : వేసవిలో పట్టణ ప్రజలకు తాగు నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు మున్సి పల్ చైర్‌పర్సన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ తెలిపారు. శని వారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశపు హాలులో పురపాలక సంఘ సాధారణ సమావేశం జరిగింది. తెదేపా వార్డు కౌనిలర్‌లు తిరుపతమ్మ, అత్తులూరి రమేష్ తమ వార్డులలో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అందరికీ తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్‌ను కోరారు. స్పందించిన చైర్‌పర్సన్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా అద్దంకి పట్టణ ప్రజలకు తాగునీరు అందించే గుండ్లకమ్మ నదిలో ఉన్న ఊటబావులలో నీటి మట్టం తగ్గినందున పట్టణంలో నీటి ఎద్దడి ఎక్కు వగా ఉన్న వార్డులలో ప్రత్యేకంగా మున్సిపల్ ఆధ్వర్యంలో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ ఆమోదం కోసం అజెండాలో పొందుపర చిన అభివృద్ధి పనులకు సంబంధించిన 68 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ దేసు పద్మేష్, వైస్ చైర్మన్2 కన్నెబోయిన అనంతలక్ష్మీ, పురపాలక సంఘం మేనేజర్ శ్రీదేవి, టౌన్ ప్లానింగ్ అధికారి నారాయణరావు, వార్డు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలి

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : గ్రామవార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగర్యూలర్ చేయాలని ఏపి జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ చైర్మన్ సి.హెచ్. సురేష్ బాబు తెలిపారు. బాపట్ల జిల్లా కలెక్టరేట్ వద్ద గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం నిరసనదీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సీపీఐ, ఏఐటీయూసీ మద్దత్తు సంఘీభావం తెలిపారు. సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు మాట నిలబెట్టుకుని సచివాలయ ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ, ఏఐటీయూసీ మద్దత్తు ఎప్పుడు ఉంటుందని జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, జేబీ శ్రీధర్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా జనరల్ సెక్రెటరీ టి.రజనికాంత్, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పి రాము, జనరల్ సెక్రెటరీ పి.హరి,సిఐటియుసి నాయకులు యమ్. మజుందార్ సహకార సంఘం జిల్లా అధ్యక్షులు యమ్. మురళి మనోహర్ రెడ్డి ఆర్టీసీ మహిళా సంఘం నాయకులు కె.రజని, జేఏసీ జిల్లా కోశాధికారి డి.దిలీప్ తదితరులు ప్రసంగించారు. రెవెన్యూ సంఘ కోశాధికారి ఎ. సుమంత్ రాజ్ బి.ఓంకార్, ప్రచార కార్యదర్శి డి.అర్జున్, జిల్లా నాయకులు పెరుగు శ్రీనివాసరావు, సిటీ యూనిట్ సహాయ కార్యదర్శి జాన్సన్ ఇతర ఉద్యోగ సంఘాలు వారు పాల్గొన్నారు.

పాస్టర్ ఇంట్లో చోరీ.. దర్యాప్తు చేస్తున్న సీఐ

విశాలాంధ్ర -చీరాల : చీరాల పట్టణంలోని సెయింట్ మార్క్స్ సెంటర్నరీ లూథరన్ చర్చ్ సమీపంలో ఉన్న పాస్టర్ ఇంట్లో చోరీ జరిగింది. ఒకటో పట్టణ సీఐ వి మల్లికార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం పాస్టర్ జోసఫ్ కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం హైదరాబాదుకు వెళ్లారు. తిరిగి శనివారం తెల్లవారుజామున ఇంటికి వచ్చారు.ఇంటి తలుపులకు వేసిన తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గుర్తించి లోపలికి వెళ్లి పరిశీలించారు.ఇంట్లో బీరువా తలుపులు తెరిచి వస్తువులు చిందరవందరగా పడి ఉండటాన్ని గమనించి చోరీ జరిగిందని తెలుసుకున్నారు. అనంతరం ఇంట్లోని వస్తువులను వెతకగా బీరువాలో ఉన్న 27 సవర్ల బంగార ఆభరణాలు చోరీకి గురయ్యాయని నిర్ధారించుకున్నాడు. అనంతరం ఒకటో పట్టణ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న వెంటనే సీఐ మల్లికార్జునరావు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. ఇంటి పరిసర ప్రాంతాలను, చోరీ జరిగిన తీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం ను పిలిపించి వేలిముద్రలను సేకరించారు. ఈ కేసును త్వరితగతన చేదించి బాధితులకు న్యాయం చేస్తామని సీఐ మల్లికార్జునరావు చెప్పారు.

గాయపడిన కార్మికుడికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పెయింటింగ్ పనులు చేసుకుంటూ ప్రమాదవశాత్తు గాయపడిన కార్మికుడు నానికి రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి వెంకటేశ్వర్లు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. పట్టణంలోని చంగల్‌రాయుడుతోటకు చెందిన కార్మికుడు నాని ప్రమాదవశాత్తు మిషన్ కాలు మీద పడటంతో తీవ్ర గాయాలు కావడం వలన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని గ్రహించి ఆర్థిక సాయం అందజేయడం జరిగిందని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

గ్రామాల్లో పనులు కల్పించండి

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పనులు గుర్తించి వలసలు లేకుండా చూడాలని ఎంపీపీ మోపిదేవి హరినాథ్ బాబు, జడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య, ఎంపీడీవో ఎస్.నాగలక్ష్మి పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు.

రాజకీయ అవగాహన లేకనే రజని వాఖ్యలు: రోజా

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ తెలుగు రాష్ట్రాల రాజకీయాల గురించి అవగాహన లేకుండానే మాట్లాడారని రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి ఆర్.కె రోజా తెలిపారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి క్యాంప్ కార్యాలయంలో శనివారం మీడియాతో రోజా మాట్లాడారు. విజయవాడలో జరిగిన మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో రజని చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు తాను భజన చేయించుకునేందుకే రజినీకాంత్‌ను శతజయంతి ఉత్సవాలకు పిలిచి స్క్రిప్టు ఇచ్చి చదివించుకున్నారన్నారు. శత జయంతి ఉత్సవాలు జరపటం చూసి ఎన్టీఆర్ ఆత్మ సంతోషిస్తుందని రజినీకాంత్ చెప్పటం హాస్యస్పదంగా ఉందన్నారు. ఎన్టీఆర్‌ను అసెంబ్లీలో ఎలా అవమానించారో తెలుగు ప్రజలంతా నాడు చూశారని ఎన్టీఆర్ చంద్రబాబును ఉద్దేశించి ఏమి మాట్లాడారో తెలుసుకోవాలని తెలియకుంటే సీడీలు పంపిస్తా చూడాలని రజినీకాంత్‌కు తెలిపారు. చంద్రబాబు మోసగాడు, తడిగుడ్డతో గొంతుకోసే రకం అంటూ స్వయంగా ఎన్టీఆరే చెప్పిన విషయం తెలుసుకోవాలన్నారు. చంద్రబాబు నాడు తన అనుకూల పత్రికల్లో ఎన్టీఆర్‌పై చంద్రబాబు దారు ణంగా వస్త్రాలు లేకుండా ఉన్న కార్టూన్లు వేయించి తీవ్రంగా అవమానించారన్నారు. అటువంటి చంద్ర బాబును చూసి ఎన్టీఆర్ ఆత్మ ఆశీర్వదిస్తుందని సంతోషిస్తుందని అనడం చాలా బాధాకరమన్నారు. ఎన్టీఆర్ చావుకు చంద్రబాబే కారణమన్నారు. బాబుకి అనుకూలంగా మాట్లాడి రజనీకాంత్ ఎన్టీఆర్ అభిమానులను అవమానించారని విమర్శించారు. హైద్రాబాద్ న్యూయార్క్ నగరంగా ఉందని రజినీ కాంత్ చెప్పటం హాస్యస్పందగా ఉందన్నారు. 2003కు ముందు మాత్రమే చంద్రబాబు ముఖ్య మంత్రి ఆ తరువాత మాత్రమే హైద్రాబాద్ అభివృద్ధి చెందిందని రోజా తెలిపారు. చంద్రబాబు విజన్ 2020 వల్ల టీడీపీకి 23 సీట్లు వచ్చాయని విజన్ 2047కి చంద్రబాబు ఏ దశలో ఉంటారో అసలు పార్టీ ఉంటుందో లేదో రజనీకాంత్ తెలుసుకోవాలని రోజా ఎద్దేవా చేశారు. దేశానికి ప్రధానమంత్రి నిర్ణయించేది నేనే రాష్ట్రపతిని నియమించేది నాకు తెలిసే అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు 27 ఏళ్లలో ఎన్టీఆర్‌కు భారతరత్న ఎందుకు ఇప్పించలేదని ప్రశ్నించారు. 2024లో చంద్రబాబు సీఎం అయ్యే అవకాశమే లేదన్నారు. చంద్రబాబునాయుడు పిలిచి భోజనం పెడితే తిని పోగిడితే అర్థం ఉంటుంది కానీ చంద్రబాబు నాయుడు ఇచ్చిన స్క్రిప్టును చదివితే పవన్‌కళ్యాణ్‌లా రజినీకాంత్ నవ్వుల పాలవుతారని తెలిపారు. రజినీకాంత్ మరోసారి రాష్ట్రంలోకి వచ్చేసమయంలో అవగాహనతో మాట్లాడాలని తెలిపారు. ఎన్టీఆర్‌ను గౌరవించాలనుకుంటే గౌరవమైన సభకు వెళ్లి చెపితే గౌరవం ఉంటుందని హితవు పలికారు. ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎంపీ నందిగం సురేష్ ఉన్నారు.

డీఎస్పీ సేవలు మరువలేనివి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : జిల్లా ఆవిర్భావ సమయంలో డీఎస్పీగా పనిచేస్తున్న ఏ.శ్రీనివాసరావు సేవలు మరువలేవని బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ది రైస్ మార్చంట్ అసోసియేషన్ కార్యాలయంలో బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు గొర్ల శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన ఆత్మీయ సత్కార సభలో డీఎస్పీ శ్రీనివాసరావు దంపతులను ముఖ్య అతిథులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన మాట్లాడుతూ జిల్లా ఆవిర్భావ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ కార్యాలయంలో అన్ని కూడా బాపట్ల ప్రధాన కేంద్రంగా ఏర్పాటు చేయడానికి రేయిబవళ్లు కృషిచేసిన వ్యక్తి డిఎస్పి శ్రీనివాసరావుని కొనియాడారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు విద్యార్థుల పట్ల పట్టుదల క్రమశిక్షణకు మారుపేరుగా డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలే నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం బీసీ జాయింట్ కమిషన్ అధ్యక్షుడు గొర్ల శ్రీనివాసరావు నేతృత్వంలో డిఎస్పి దంపతులను ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వార్డ్ వైస్ చైర్మన్ పిన్నిబోయిన ప్రసాదరావు, ది సాల్వేషన్ ఆర్మీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ దాసరి శ్యామ్ లివింగ్ స్టన్ ఉన్నారు.

మతోన్మాద బీజేపీని సాగనంపుదాం

విశాలాంధ్ర - కొల్లూరు: ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బీజేపీని సాగనంపుదాం దేశాన్ని కాపాడుకుందాం అని కోరుతూ ఈనెల 14వ తేదీ నుండి 30వ తేదీ వరకు సిపిఐ సిపిఎం ఆధ్వర్యంలో జరిగే ప్రచార బేరి కార్యక్రమం శనివారం కొల్లూరులో ప్రారంభమైంది. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే నిత్యవసర వస్తువుల ధరలు తగ్గిస్తామని నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చిన బిజెపి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటి నెరవేర్చకపోగా 9 ఏళ్ల పాలనలో అవినీతి తారాస్థాయికి పెరిగిపోయిందని ఆయన తెలిపారు. దేశ సంపదను మోడీ ధారా దత్తం చేస్తున్నారన్నారు. బిజెపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు రైతులు వ్యవసాయ కూలీలు కార్మికులు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. మోడీని గద్దె దింపండి - దేశాన్ని కాపాడండి బిజెపి ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలపై సిపిఐ, సిపిఎం పార్టీలో నిరంతరం పోరాడుతూ ఉంటాయని తెలిపారు. దేశ సంపద ఆదాని. అంబానీ చేతిలో పెడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు గొట్టుముక్కల బాలాజీ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బందారు శ్రీనివాసరావు. విష్ణు మలకల శ్రీనివాసరావు సిపిఐ సీనియర్ నాయకులు బి ప్రభాకర్ రావు గంట రాంబాబు సిపిఎం నాయకులు కృపానందం, మణిలాల్.సుధాకర్, వెంకట్రామైయ్య అగ్గిరామైయ్య, సుబ్బారావు పాల్గొన్నారు

ప్రజా నాడి వైసీపీ ప్రభుత్వం వైపు

- ఎమ్మెల్యే కోన రఘుపతి

విశాలాంధ్ర - బాపట్ల : రాష్ట్రంలో ప్రజా నాడి వైసీపీ ప్రభుత్వం వైపు ఉందని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. మానమ్మకం నువ్వేజగన్ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేశామంటూ ఎమ్మెల్యే కోన రఘుపతి శనివారం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే కోన ఇంటి దగ్గర నుంచి చీలు రోడ్ మీదగా పాత బస్టాండ్ వద్ద ఉన్న కోన ప్రభాకరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళురల్పించి ర్యాలీగా దగ్గుమల్లివారిపాలెం వెఎస్సార్ విగ్రహంకు నివాళులర్పించి అక్కడ నుంచి రైల్వేస్టేషన్ కూడలిలోని ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు పూలమాలలు వేసి నివాళురల్పించారు. అనంతరం ఎమ్మెల్యే కోన ఇంటి దగ్గర ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడతూ జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమాన్ని ఈనెల 7వ తేదీ నుంచి 29వ తేదీ వరకు రాష్ట్రంలో 1.65 లక్షల కుటుంబాలకు గానూ 1. 45 లక్షల కుటుంబాలను గృహసారథులు సచివాలయ కన్వీనర్లు ఎంపీటీసీలు జడ్పీటీసీలు సర్పంచులు వైఎస్ఆర్సిపి నాయకులు ప్రజా ప్రతినిధులు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు పీపుల్ సర్వే నిర్వహించగా ప్రభుత్వంకు మంచి స్పందన లభించిందన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ దొంతిబోయన సీతా రామిరెడ్డి, కర్లపాలెం జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి,బాపట్ల ఎంపీపీ చినపోతుల హరిబాబు, మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి. మండలపార్టీ అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, నాయకులు చేజర్ల నారాయణరెడ్డి, కాగిత సుధీర్‌బాబు, చింతల రాజశేఖర్ ఉన్నారు.

వాహనదారులకు ధ్రువీకరణ పత్రాలన్నీ ఉండాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన పత్రాలన్నీ కలిగి ఉండాలని నిజాంపట్నం ఎస్ఐ ఎస్.రమేష్ తెలిపారు.మండల కేంద్రమైన నిజాంపట్నంలోని బీసీ గురుకుల పాఠశాల సమీపంలో వాహనాల తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని చెప్పారు.డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు.

కులాలు, మతాల మధ్య విద్వేషాలు రేపుతున్న మోదీని గద్దె దించండి

సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - జె.పంగులూరు : కులాల మధ్య, మతాల మధ్య ప్రజల మధ్య విద్వేషాలు నింపుతూ, ప్రజల ఐక్యతను దెబ్బతీసే విధానాలతో పాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని 2024లో గద్దె దించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ కోరారు. వామపక్షాలు నిర్వహిస్తున్న మోదీని గద్దె దింపండి, దేశాన్ని కాపాడండి, కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలపై ప్రచార భేరి కార్యక్రమం మండల కేంద్రమైన పంగులూరులో శనివారం జరిగింది. ఈ సందర్భంగా సింగరకొండ మాట్లాడుతూ మోడీ హటావో, భారత్ బచావో అనే కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా వామపక్షాలు బిజెపి ప్రభుత్వ విధానాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం ఈనెల 14వ తేదీ నుండి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు కేంద్రం ఇవ్వటం లేదని, నల్లధనం వెలికి తీసి ప్రతి ఇంటికి 15 లక్షలు ఇస్తానని మోడీ మోసం చేశాడని అన్నారు. బ్యాంకులలో డబ్బు వేయాలన్న, తీసుకోవాలన్న ప్రజల వద్ద నుండి టాక్స్ ల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. 2000 నోట్లు మొత్తం నల్లధనంగా మారిందని, కేంద్రంపై పోరాడే వారిపై సిబిఐ, ఈడి ద్వారా దాడులు చేస్తూ భయపెడుతున్నారన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల హామీని నిలబెట్టుకోక పోగా, ఉన్న ఉద్యోగాలు తీసేస్తున్నారని తెలిపారు. రైతులకు పంట చేతికి వచ్చే సమయంలో ధరలు పతనం చేస్తూ, రైతులను నిలువునా ముంచారని, ఢిల్లీలో రైతులు సంవత్సర కాలంగా ధర్నాలు చేస్తున్నా, వ్యవసాయ చట్టాలను మద్దతు ధర చట్టాలను రద్దు చేయడం లేదని అన్నారు. ఎరువులు విత్తనాలు సబ్సిడీ రూపంలో రైతులకు అంద జేయాలని అన్నారు. ప్రత్యేక హోదా ద్వారా రాష్ట్రానికి పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని, ప్రత్యేక హోదా అడిగే పరిస్థితి జగన్ ప్రభుత్వానికి లేదని, విభజన చట్టంలో ఉన్న హక్కుల్ని రాష్ట్ర ప్రభుత్వం అడగటం లేదని, పోలవరం నిధులు ఇవ్వటం లేదని తెలిపారు, ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు బి.వీరాంజనేయులు సిపిఐ నియోజకవర్గ నాయకులు కె ఎల్ డి ప్రసాద్, సి పి ఎం రాష్ట్ర నాయకురాలు కె.రమాదేవి, సీపీఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, నాగబోయిన రంగారావు, రాయని వినోద్ బాబు, తలపనేని రామారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.